"ఇంకో అరగంట పోనీ. ఆకలిగా లేదుగా. అలా గాలికి వెళ్ళి మళ్ళీ వచ్చి తినవచ్చు" అన్నది మనస్సు.

ఆనందరావు రొట్టెముక్కను బల్లమీదనే పెట్టి తలుపువేసి బజారువైపు బయలుదేరాడు. రోజూ వున్నట్టుగానే వుంది బజారు. అంతా మనుష్యులు. కేవలం వాహనాలు. తీరికలేని దినచర్యలు. ... సామ్రాజ్యం ... ఆ కోయింగాలం నుండి ... ఓహో అర్థంలేని ... అరగంట రాగానే తిరిగి వచ్చాడు. తలుపు తీశాడు. బల్లమీద రొట్టెముక్కను తింటూవుంది పందికొక్కు. దాదాపు పూర్తికావచ్చింది. ఆనంద రావుకు కోపం వచ్చింది. కిటికీలు మూసివేశాడు. తలుపుగడియ బిగించాడు. అది చాల చిన్నది. ఎక్కడికి పోతుంది పందికొక్కు?

చేతకంది. కమ్మి తీసుకొని పోరాటాని కుప్రక మించాడు. ఆ పందికొక్కు ఎన్నో తంటాలు పడింది. ఉన్న రెండు పెట్టెల చుట్టూ శరణు శరణంటూ వేయి ప్రదక్షిణాలు చేసింది. చివరికి కమ్మితో కొట్టిన దెబ్బకు కుడికాలు తెగిపోయింది....రక్తం...రక్తం.

బల్లమీద నుండి...ఆ బల్లమీద వున్న చిత్తు కాగితాలమీదనుండి చుక్కలు చుక్కలుగా కారుతూ వుంది. అది నెత్తురు. ఎవరిదైతేనేం దేనిదైతేనేం అది నెత్తురు. పచ్చి నెత్తురు. ఉడుకు నెత్తురు. ఇప్పుడే చిందిన నెత్తురు.

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. అతని గుండె లెందుకో కొట్టుకుంటూ వున్నై. అతడాగిపోయాడు.

ఆ పందికొక్కు ప్రత్యేకమైన రక్తంపనితో పోరాడి; చాల వీడునిలా బల్లకింద పడిపోయింది. ఆ వెలుగులో దాని దగ్గరికి వెళ్ళి చూశాడు. దాని రెండు కళ్ళనుండి ప్రవహిస్తున్నవి నీటి ధారలు. సంశయమెందుకూ? అవి కన్నీరే! అది కూడా ఏడుస్తుంది. అది ఇప్పుడూ ఏడుస్తూనే వుంది. దానికి గుండె వున్నది. ఆ హృదయంలో నెత్తురున్నది. దానికి ఉదరమున్నది. అందుకే ఆకలి వున్నది. కనుకనే అది రొట్టెను తిన్నది.

ఆనందరావు కుప్పగా కూచున్నాడు. అతని హృదయం నవనీతం. అతడొక కవీశ్వరుడు. ఆ బల్ల మీది చిత్తు కాగితాలు అతడు వ్రాస్తున్న కావ్యంలోని పద్యాలు. అవి నెత్తురు మరకలతో నిండిపోయినై.

"ఎందుకు కొట్టావు దీన్ని?" ఆనందరావు తనలో తానే ప్రశ్నించుకొన్నాడు. కొట్టడం కాదు. ఖూనీ చేశావు. ఖూనీ...అదుగో పచ్చి నెత్తురు. ఎంత కొంచెమైనా అదీ నెత్తురే. ఎంత చిన్న ప్రాణమైనా అదీ ప్రాణమే.

"నాకు ఆకలి వేసింది నేను రొట్టెను తిన్నాను. అందుకే నీవు నన్ను చంపివేశావు" అంటున్నవా కళ్ళు. దాని పెదిమలు కదులుతున్నాయి. ... పూర్తిగా వ్రాయలేకపోయాను. అది ... చెప్పుతున్నది.

"ఏమిటి నీవు వ్రాస్తున్నది?"

"కవిత్వం" తనకు తెలియకనే జవాబు చెప్పాడు ఆనందరావు.

"ఆ కావ్యంలో ఒక కథ. ఆ కథా వస్తువు అతి సామాన్యమైనదైనా అది హృదయాలను ద్రవింప

# కె. సభా

చేస్తుంది. కఠినుల ప్రాణిపించేస్తుంది. ... ద్రవింపచేస్తుంది." అంతరాత్మ చెబుతున్నట్టున్నది.

"నా కా కథను చెప్పవూ?" ప్రశ్నించాయి దాని కళ్ళు.

ఆనందరావు హృదయం ధ్వనించింది. అతని కంఠం నుండి ప్రసారమైం దొక అపూర్వ గానం...

"ఇదే కథ ... చెబుతున్నాను. వింటున్నావా?" అన్నాయి అతని నేత్రాలు.

ఆ భావాన్ని గ్రహించిన దాని నయనాలనుండి రాలినవి ఆనందాశ్రువులు.

"ఇటీవలనే వచ్చిపోయిం దొక కాటకం."

"అవునవును. ఇప్పుడు మా జాతి పూర్తిగా నశించిపోతుం దనుకున్నాను" అన్నట్టు మూల్గింది పందికొక్కు.

"ఆ కరువులో ఒక పల్లెటూరిలో జరిగిన సంఘటన ఈ కథ..."

"ఆ వెనుక..." గాయపడిన కుడికాలిని మెల్లగా కదిలిస్తూ కొంచెం భారం తగ్గినట్టు అనుకొన్నది పందికొక్కు.

"ఆ కుగ్రామంలో ఒక రైతు కుటుంబం. చాల తక్కువ పొలం. ఆ పొలంకూడా మెట్ట. దానికి ఏటి నీరు ఎక్కదు. కుంటనీళ్ళు అందవు. బావి త్రవ్వితే బండ అడ్డువచ్చింది. అంతరంగ్గా లోతుకు దానిని చీల్చి బోరింగు పెట్టడానికి కావలసినంత పైకం లేదు. కనుక ఆ పొలానికి వర్షంసిరే ఆధారం. అను క్షణమూ ఆకసంవంక చూస్తున్న ఆ రైతు సేద్యం లంక మేతకూ గోదావరి ఈతకూ సరిపోయినంతగానైనా సరిపోదు. కాడిగిత్తలకు గడ్డికూడా కరువే. పేరునకు సేద్యం కానీ అందులో వచ్చే ఆదాయం ఆ కుటుంబానికి ఏడాదిలో మూడు మాసాలకైనా



హైదరాబాద్ బ్రాంచి: సుల్తాన్ బజార్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదురుగా హైదరాబాద్ (దక్కన్)

చాలదు. అందుకే ఇల్లాండ్లు కూలి చేసేవారు. ఈ కూలి ఎల్లకాలమూ దొరకదు: కోతలకాలం ఊడ్పుల కాలం తొలకరిలో మాత్రం ఓ పక్షం రోజులపాటు దొరకుతుండే వారి పనులు."

కాలు మెలిక తిరిగేట్టున్నది గాయంతో. ఆ కోత నెత్తుర్లు గ్రుక్కెట్టిందేమో! లేకపోతే ఏదీ నొప్పి కావచ్చు అనుకొన్నాడు ఆనందరావు. పందికొక్కు మరీ కొంత విశ్రాంతిగా పడుకొన్నది. దాని కన్నుల నుండి నీరు ధారగా ఆగిపోయింది. ఆనందరావు మళ్లీ మొదలుపెట్టబోయి—

"వింటున్నావా?" అన్నాడు.

"వింటున్నాను. బాగా శ్రద్ధగా వింటున్నాను" అన్నట్టు చెవులు నిక్కపొడిచింది.

"ఆ కుటుంబానికి మంచి కాలంలోనే కూడా గడ్డు కాలం. అట్లాంటి కాలమున్నా మెల్ల మెల్లగానే ప్రవేశించింది కరువు రక్కసి. అది ఈ పేదవాళ్ల పంటకళ్ళాలని దోచింది. నేలమీది తేమనంతా పీల్చివేసింది. చెరువులోని నీరంతా త్రాగేసింది. పచ్చని పైరులంతా విస్తరించి పిప్పి పిప్పిగా ఉమ్మివేసింది. అడవులలోని సంపదనంతా స్వాహా చేసింది. చివరికి పశువులను బాధించింది. అవి ఎముకల ప్రోవులైనా వాటి తోళ్ళను చూరగొంటూ వదిలి పెట్టింది. అలాంటి పరిస్థితిలో ఆ రైతు కుటుంబం పగలూ రాత్రీ కడగండ్ల చివరికి ఆత్మాహుతి ఆ కష్టంలో వుంది.

పండా చిక్కిపోయారు. ఎముకలైపోయారు. రైతు దంపతులు పరుపు లంఖణంలో వున్నారు. ఎండిపోయిన అడవినంతా గాలించి తెచ్చిన గొట్టె గడ్డలు ఉడుకుతూ వున్నాయి. ఇద్దరు పిల్లలూ ఆ ఉడికే గడ్డలను చూస్తూ కూచున్నారు. ఆ సమయంలో ఎవరో ఒక అనాథ అక్కడికి వచ్చాడు. అతని కడుపు వెన్నంటుకొనిపోయింది. అతడు మాట్లాడగలడుగాని గొంతు పెగలడంలేదు. ఆరిపోతున్న కంటిపాపలు మాత్రం ఆకలి భావాలను వ్యక్తం చేస్తున్నాయి. అతడా పూరిగుడిసె ముందు కూలిపోయాడు.

పిల్లలా ముసలాణ్ని చూసి దోసెడు చన్నీళ్లను ముఖంమీద చల్లారు. అతడు ఆ తడితో స్పృహ వచ్చి పిల్లల్ని చూస్తూ అతి ప్రయత్నంమీద కుడిచేతినెత్తి ఆకలి అంటూ సంజ్ఞ చేశాడు."

పందికొక్కు కనులనుండి నీటిధార కారడం మొదలుపెట్టింది. అది ఈ మారు గట్టిగా మూలి గింది. ఆ మూలుగులో అనంతమైన బాధ ధ్వనిం చింది. ఆవేదన ప్రస్ఫుటించింది. శోకం ప్రతిధ్వనిం చింది.

"ఆకలితో చేతులు చాచిన ఆ ముసలివాణ్ని చూసి ఆ పిల్లలు నీరైపోయారు. వారి ఆకలిని వారు మరచి పోయారు. ఆ వుడికీ వుడకని గడ్డలను తెచ్చి అతని ముందుంచారు. అతడు లేచి కూర్చున్నాడు ఒకొక్క గడ్డనే తీసి తింటున్నాడు. అతడలా తింటున్నప్పుడు అతని కనులలో కన్పించే సంతృప్తినీ, ముఖంలో వ్యక్త



నేషనల్ మ్యూజియం

(కరాచీ) —ఫొటో: శ్రీ జి. వస్యాభిరామ్

మయ్యే కృతజ్ఞతాభావాన్ని చూస్తూ కూచున్నారా పిల్లలు.

ఇంతలో ఆ రైతు అక్కడికి వచ్చాడు. ఆ దృశ్యాన్ని చూసి స్తబ్ధుడై నిలబడిపోయాడు. పిడికెడు గడ్డల కోసం ఎన్ని మైళ్ళు తిరిగాడో అతనికి తెలుసు. అతని కడుపు దహించుకపోయింది. రెండు రోజులు శ్రమ పడి ఆ చిన్నబిడ్డలకోసం సంపాదించిన ఆ గడ్డలను ఎవరో పరాయివాడు తినివేస్తున్నాడు అతనికి కోపం వచ్చింది. అలాంటి పరిస్థితులలో వచ్చే కోపానికీ, మామూలు వాతావరణంలో ప్రభవించే క్రోధానికీ ఎంతో తారతమ్యం వుంది. ఆ భేదమే కన్పించిం దతని కోపంలో. అతడు ఆవేశంలో అంధుడై పోయాడు. ఒక్కసారి ఈ లోకమంతా స్వార్థమనే ముసుగులో భయంకరంగా మూలుగుతున్నట్లు కన్పించిందతనికి. చేతికందిన బడితెతో ఆ వృద్ధుని మస్తిష్కాన్ని వేయి ముక్కలు చేయాలనుకొన్నాడు. తండ్రి కోపాన్ని పసికట్టిన ఆ పిల్లల్లో పెద్దవాడు సాహసించేసి అన్నాడు. "మేమే ఇచ్చాము నాన్నా. ఆకలికి చచ్చిపోతున్నాడు" అని. ఈ మాటలంటూ ఆ కుర్రాడు తండ్రికీ, ముసలాడికీ మధ్య నిలబడ్డాడు. ముసలాడీ మాటలనేమీ గమనించడంలేదు. అతడు చావుకైనా సిద్ధపడే వున్నాడు. ఆ చనిపోవడానికి ముందు కడుపునిండా తిని చావాలన్నదే అతని ఆకాంక్ష. ఆకలిని చల్లార్చుకోవడమే అతని ధ్యేయం."

ఆనందరావు చెబుతున్నకొద్దీ పందికొక్కు అతని వంకనే చూస్తు మది.

"ఇంతవరకూ వచ్చింది కథ. ఆ వెనుక ఆ ముస లాడా ఆ కుటుంబాన్ని రక్షించడంకోసం అత్యంత సాహసానికి దిగుతాడు. అడవిలో గడ్డలకోసం తిరుగు తున్నప్పుడు ఒక చిన్న గుడారం కన్పిస్తుందతనికి. ఆ గుడారం వేటకోసం వచ్చిన జమీందారుది ఆ ముసలాడు అందులో ప్రవేశిస్తాడు. ఇద్దరు నౌకర్లు మైమరచి నిద్రపోతుంటారు. అక్కడున్న తినుబండారాలనంతా మూట గట్టుకొంటాడు. వారం రోజులకు చాలినంత ఆహార సామగ్రి దొరుకుతుంది. ఆ మూటను అతి కష్టంమీద ఎత్తి నెత్తిన పెట్టు కొంటాడు. గుడారంనుండి పది గజాలు దాటు కొంటాడు. ఇంతలో ఆ నౌకర్లు మేలుకొంటారు. చిందర వందరైన వస్తువులను చూడ్డంతోనే వారి దృష్టి నాలుగు ప్రక్కలా ప్రసరించబడుతుంది. వారిలో ఒకడు చాలా చురుకైనవాడు. తక్షణం ముస లాణ్ని గుర్తించి లేడిపిల్లలా అంగలు వేసుకొంటూ పరుగుతీస్తాడు. పాపం వృద్ధుడు వెనుదిరిగి చూసి ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని పరుగెత్తుతాడు.

అది అడవి ప్రాంతమని నీకు ముందుగానే చెప్పాను. ఒక్కొక్క చోట కాలుజారితే ఎముకలు చూర్ణమయ్యే టంత ప్రమాదమైన జర్తెలు. అంతవనీ జరిగింది. ఆ ముసలాడి బొటనవ్రేలు చిన్న రాతికి తగిలి తూలి పడ్డాడు. పట్టుతప్పి నాలుగుమెట్లు క్రిందికి దొర్లాడు. అదొక వెదురు పొద అందులో నున్న ముండ్లు ఈటెలు కంటే పదునైనవి. కత్తుల బోనులో చిక్కిన పావిలా ఆ వృద్ధుడు గిజ గిజ లాడిపోతున్నాడు అంత జరిగినా అతడామూటను వదలిపెట్టలేదు."

## పాములు

పాములు రెండవ భాగం వ్యాసాన్ని బొమ్మలతో వచ్చే సంచికలో ప్రచురిస్తాము.

పందికొక్కు పెదవులను కదిలించింది. "ప్రాణం పోతున్నా అతడు తన ప్రాణాన్ని రక్షించిన పిల్లలను రక్షించాలనే పట్టుదలతోనే వుంటాడు" అంటున్న దనుకున్నాడా పెదవుల కదలికలోని భావాలను గమనించిన ఆనందరావు.

"ఆ వృద్ధుడు పట్ట పెదురుపాక వద్దకు వచ్చాడా నౌకరు. ఆ ముసలాణ్ణి చూచిందే అతని కోపం హరించుకపోయింది. పరితాపంతో హృదయం దహించుకపోయింది. జమీందారు నౌకరైనా అతడూ ఒక పేదవాడే. అవసరం వచ్చినపుడు అతని హృదయం పేదలతో కలిసిపోతుంది. ముసలివాణ్ణి పైకి తీసి పొదనుండి ఇవతలకు తెచ్చిపెట్టాడు. ఆ వృద్ధుడు కన్నులు మూస్తూ తెరుస్తూ వున్నాడు. అంత ఎత్తు నుండి పడడంచేత అతని ముదురు ఎముకలు ఎక్కడి వక్కడ విరిగిపోయాయి. పండిపోయిన గుండెలు వగుళ్ళువారుతూ వుంది. అక్కడికక్కడే చేరెడు నెత్తురు కక్కుకున్నాడు. "నేను చచ్చిపోతున్నాను బాబూ, నువ్వెవరివో నాకు ఒక వుపకారం చేస్తావూ? మనిషి చచ్చిపోయేటప్పుడు కోరుకొనే వరాలు సాధారణంగా అత్యంత స్వల్పమైనవే. ఇక్కడికి రెండు మైళ్ళ దూరంలో వుత్తరంగా ఒక ఎండిపోయిన కుంట వున్నది. ఆ కుంట కట్టకు దిగువ తూము దగ్గరే చిన్న గుడిసెలో ఇద్దరు పిల్లలుంటారు. వాడు ఆకలికి ఈ పాటికే చచ్చిపోయారేమో! భగవంతుడు అంతపనీ చేసివుండడనుకొంటాను. నీవు ఈ మూటను పట్టుకెళ్లి వారికి అందిస్తానని చెబితే నేను చల్లగా సంతృప్తిగా కన్నులు మూస్తాను" అన్నాడా వృద్ధుడు.

నౌకరు అలాగేనంటూ మాట ఇవ్వగానే ఆ వృద్ధుని ప్రాణాలు అనంత వాయువుల్లో లీనమైపోయాయి."

ఉలిక్కిపడ్డట్టు ఎగిరిపడింది పందికొక్కు. ఆ వృద్ధుని ప్రాణాలు పోయాయని విన్నప్పుడు దాని హృదయం ఎంతగా చలించిందో ననుకొన్నాడు ఆనందరావు. పందికొక్కు తన ముందరి కాళ్లను మెల్లగా కదిలించింది. దాని గాయం నుండి మెల్లగా నెత్తురు కారడం ఎప్పుడో ఆగిపోయినా కన్నులనుండి మాత్రం నీరు కారుతూనే వుంది.

"ఆ నౌకరు ఆ వృద్ధుని శవాన్ని అక్కడున్న ఎండుటాకులతో కప్పి ఆ మూట నందుకొని గుడిసె వేపు పరుగుతీశాడు. ఒక నిండుప్రాణం పోయింది. ఆ పసి నిసుగులనైనా రక్షించగల్గితే తన జన్మ సార్థకమైనట్లేనని అతడు భావించాడు. తిండికిలేక వూరు వదలి అందరూ వెళ్లిపోయిన విషయం అతడెరుగును కానీ ఆకలితో కనులముందే చచ్చిపోయిన వారినంత వరకూ అతడు చూడలేదు. ఆ పిల్లలెవరో పాపం! బహుశా ఈ వృద్ధునికి మనుమలై వుంటారని అతడు భావించుకొంటూ శరవేగంతో రాళ్ళు రప్పల్ని దాటుకుంటూ ముందుకు పోతున్నాడు. అలా పరుగెత్తుకొంటూ వెళ్లి గుడిసెను సమీపించేటోగా ఆర్తనాదం వినిపించింది. అతని గుండెలు ద్రవించిపోయాయి. ఒక పిల్లవాడు చనిపోయాడేమో. మరో బిడ్డనైనా బ్రతికిస్తానంటూ మరీ వేగంగా గాలి కంటే తీవ్రంగా దూసుకపోయాడు. గుడిసెలో అడుగుపెట్టగానే అతని హృదయం పగిలిపోయింది. ఒక బిడ్డ ఎప్పుడు చనిపోయాడో...రెండో బిడ్డ అప్పుడే కన్నులు మూశాడు. ఆ తల్లి తేలకళ్ళువేసి రెండు చేతులతోనూ రెండు శవాలను హదివి పట్టుకొని అచేతనంగా పడివున్నది. ఆ రైతు మహా యోగీశ్వరునివలె వింధ్యాచలం వంటి గుండె నిబ్బరంతో ఆ దృశ్యాన్ని చూస్తూ కూచున్నాడు. ఎన్నో క్షణాలు నిశ్శబ్దంగా గడిచిపోయిన తదనంతరం నౌకరు మూటను విప్పి—,

"మీ నాన్నగారనుకొంటాను, ఆ ముసలాడు మీకీ మూటను ఇచ్చిరమ్మన్నాడు" అన్నాడు.

రైతు ఆ నౌకరును ఎగా దిగా చూచి ఆ మూటలోని ఆహార సామగ్రిని పరిశీలిస్తూ అన్నాడు.

"ఇవన్నీ నా పొలంలో ఒక నాడు పండినవే. మీ జమీందారింట్లో ఇంకా ఎన్నివేల బస్తాల బియ్యం మూల్గుతున్నదో కదా? ఈ సామగ్రిని పంపిన ముసలాడు మా నాన్నగారు కాడు గానీ అంతకంటే తండ్రికంటే ఆత్మీయుడు. ఈ మూటను పదిలంగా ముడిపెట్టి జమీందారుగారికివ్వు. ఒక్కమాట మాత్రం చెప్పు."

"ఏం చెప్పమంటారు?" అన్నట్టు చూశాడు నౌకరు.

"నేను రైతును. నా కుటుంబం ఆకలితో చచ్చిపోయింది. అదే ఆకలితోనే నేనూ చనిపోతాను. కాని నా రైతాంగం శాశ్వతంగా వుంటుంది. అతడు జమీందారు. ఇందరి రైతులను దోచి బ్రతుకుతున్నాడు. అయినా అతని అధికార దేవత చనిపోతుంది. అది శాశ్వతంగా చచ్చిపోతుంది. దాని నెవరూ బ్రతికించలేరని చెప్పు."

ఈ మాటలను అతడు చాలా బిగ్గరగా అన్నాడు. ఆ శబ్దానికి ఆ కొండ శిలాలన్నీ ప్రతిధ్వనించాయి.

"ఇక నీవు వెళ్ళు. సత్వరంగా వెళ్లిపో...ఊఁ...ఈ మాటలను మాత్రం చెప్పడం మరచిపోకేం" అంటూ ఆ మూటను ఎత్తి నౌకరు నెత్తిపై పెట్టాడు. ఆ నౌకరు గుడిసెను వదలలేక వదలిపెట్టాడు. అతడు బైటకు వచ్చి రాగానే గుడిసె అంటుకపోయింది. ఆ గుడిసెలోనున్న మూడు శవాలతోపాటు ఆ రైతుకూడా సజీవంతోనే ఆహుతియైపోయాడు. అంతే" అన్నాడు ఆనందరావు.

పందికొక్కు కొంచెం ముందుకు జరిగి ఆనందరావు పాదాలను స్పృశిస్తోంది. అతని వైపు సంతృప్తిగా చూచింది. మరోకసారి ఎంతో జాలిగా కూడ చూచింది. ఆ చూపులోని అర్థాన్ని గ్రహించాడు ఆనందరావు. "ఇంత కరుణాపూరితమైన కావ్యాన్ని గానంచేసిన నీవు ఒక రొట్టెముక్కను తినివేసినందుకు నన్ను ఖూనీ చేశావు."

ఆనందరావు ఉలిక్కిపడ్డాడు. "నా తప్పును క్షమించు. నేను గొప్ప అపరాధం చేశాను" అన్నట్టు దాని వంక చూచాడు. అది తన నోటిని తెరచింది బహుశా దప్పిక వేస్తున్నదేమో అనుకొని ఆనందరావు తక్షణం పైకిలేచి మట్టి కూజానుండి గ్లాసెడు నీళ్ళు వంచి దగ్గరకు తీసుకవెళ్ళాడు.

తెరచిన నోరు తెరచినట్టే వుంది. ఆ జీవిలో జీవం లేదు. అది చనిపోయింది. ఆనందరావు చేతిలో గ్లాసు జారిపోయింది. బల్లమీది చిత్తు కాగితాలు గాలికి రెపరెప లాడుతూ పైకిలేచి గది నిండుకు పడుచుకపోయాయి.






రిస్టువాచి రు. 6/- మాత్రమే
15 జాయింట్సు స్విస్ తయారి రిస్టువాచి 5 సం. గ్యారంటీతో షైన్ సిస్టం కలది రు 6 మాత్రమే. పోస్టేజి రు 1-4-0 అదనం.
జాబులు ఇంగ్లీషులో వ్రాయాలి.
హిలిమన్ కొంపెనీ కలాలు వ్యాప్తి పరచే నిమిత్తమే ఈ పథకం ప్రవేశ పెట్టబడింది. సత్యమిస్ట ప్రకారం వాపసు చేయబడును.
HILLMAN TRADING Co. (A.M.)
పో. బా. 1098—[illegible]